
వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 056
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
ఫిబ్రవరి 09, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## నేటి ఓటుతో.. రేపటి అభివృద్ధి

- పరకాల 7వ వార్డులో 'హస్తం' జోరు
- పావుశెట్టి సునీల్ విస్తృత ప్రచారం
- ఇంటింటి ప్రచారంలో హామీల జల్లు
- వార్డు సుందరీకరణే లక్ష్యం
- బీఆర్ఎస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు

7లో..



## వాహనాలు తీసుకెళ్లండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



## ఘనంగా వల్లాల జన్మదిన వేడుకలు

సీనియర్ జర్నలిస్ట్, మన తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి వల్లాల వెంకటరమణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, పూర్వ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్టులు వేముల సదానందం, చెరకు వేణు ప్రసాద్ తదితరులు పాల్గొని వెంకటరమణను ఘనంగా సన్మానించారు. శాలువతో సత్కరించి పూల బొకేను అందజేశారు. శతమానం భవతి అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

## వారిది దండుపాళ్యం బ్యాచ్

- రేవంత్ రెడ్డిని నమ్మి ప్రజలు నష్టపోయారు
- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఆరు గ్యారెంటీల బాండ్ పేపర్ అడ్రస్ లేదు
- పరకాలను అభివృద్ధి చేసింది చల్లా ధర్మారెడ్డే
- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్న కేటీఆర్

8లో..






# రేపు నోట్లు ఎల్లుండి ఓట్లు

- పోటాపోటీగా అక్రమాలు
- గెలుపే లక్ష్యంగా పంపకాలు
- గుబులు పుట్టిస్తున్న ఓటర్ శైలి
- ముగిసిన ఎన్నికల ప్రచారం
- బంధువుల అకౌంట్ ద్వారా యూపీఐ చెల్లింపులు

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సోమవారం సాయంత్రం 5గంటలకు పార్టీల మైకులు మూగబోయాయి. చివరి రోజు కావడంతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఇతర నేతలంతా బిజీబిజీగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అయితే తమకు ఓటు వేయాలని అభ్యర్థించిన ఏ ఒక్కరినీ నొప్పించకుండా ఓటర్లు తెలివిగా వ్యవహరిస్తున్నారు. ఇంటికి వచ్చి ఓటు అడిగిన ప్రతి ఒక్కరికి మా ఓటు నీకే అంటూ బదులిస్తున్నారు. ఓటర్ల శైలి అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తోంది. దీంతో ఈ నెల 11న జరుగనున్న పుర ఎన్నికల్లో ఓటర్ల నాడి పట్టేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రచారం ముగియడంతో అన్ని పార్టీలు పంపకాలకు తెరలేపాయి. ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ఒకరికి మించి మరొకరు డబ్బులు పంపిణీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఆ ఇంటిలో ఉన్న ఓట్లను లెక్కగట్టి నగదు అందిస్తున్నారు. దీంతో ఒక్కో ఓటు ధర రూ.2వేల నుంచి రూ.5వేల వరకు పలుకుతోంది. మున్సిపాలిటీల్లో మంగళవారం నోట్ల పండుగ.. బుధవారం ఓట్ల పండుగకు అందరూ సిద్ధమయ్యారు.

- వరంగల్ వాయిస్, డోర్నకల్

వివరాలు2లో..

# రేపు నోట్లు.. ఎల్లుండి ఓట్లు






- పోటాపోటీగా అక్రమాలు
- గెలుపే లక్ష్యంగా పంపకాలు
- గుబులు పుట్టిస్తున్న ఓటర్ శైలి
- ముగిసిన ఎన్నికల ప్రచారం
- బంధువుల అకౌంట్ ద్వారా యూపీఐ చెల్లింపులు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ప్రలోభాల పరంపర కొనసాగుతోంది. పురపాలక సంఘాల ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీలు తాయిలాల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ స్లిప్పులతోనే మద్యం సీసాలు పంపిణీ చేస్తూ తమ ప్రత్యేకతను చాటుకొంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో చికెన్, మటన్, స్వట్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్, బిర్యానీలు, చీరలు, స్టీల్ క్యాన్ల పంపిణీ జరుగుతోంది. అయితే ఈ పంపిణీ గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. దూర ప్రాంతాలనుంచి వచ్చే వారికి ప్రయాణ భత్యాలు ఆఫర్ చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఎన్నికల సంఘం అధికారులు, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వివాదాలకు కారణమవుతోంది.

### అంతా సైలెన్స్..

సోమవారం ఆఖరి రోజు కావడంతో సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. కార్నర్ మీటింగులు, బైక్ ర్యాలీలు, డోర్ టు డోర్ వంటి ప్రచారాలను ముమ్మరంగా నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుంది. ఈ సమయంలో బయటినుంచి ప్రచారం నిమిత్తం వచ్చిన వ్యక్తులు, లీడర్లు, పార్టీ కార్యకర్తలు పట్టణాలను విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. సోమవారం సాయంత్రం 5 గంటలనుంచి ఎన్నికలు పూర్తయ్యేవరకు మద్యం విక్రయాలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆయా మద్యం దుకాణాలకు సీల్ వేశారు.

### అయోమయం..

ఈ నెల 11వ తేదిన జరుగనున్న పుర ఎన్నికల్లో ఓటర్ల నాడి పట్టేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. తనకే ఓటు వేయాలని అభ్యర్థించిన ప్రతి ఒక్కరికీ కాదు.. కూడదు అనకుండా హామీ ఇస్తున్నారు. మా ఓటు తప్పకుండా మీకే అంటు హామీ ఇస్తున్నారు. ఓటర్ శైలి పోటీ పడుతున్న అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తోంది. పైకి గంభీరాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ లోపల మాత్రం డబ్బు, శ్రమతో పాటు పరువుపోతుందని టెన్షన్ పట్టుకుంది. ఒకసారి అవకాశం ఇచ్చి చూడండి అభివృద్ధి చేసి చూపిస్తానంటూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న యువ అభ్యర్థులకు సైతం ఓటర్లు ఇదే పాట వినిపిస్తున్నారు.

### భయం.. భయం..

బుధవారం జరుగునున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు భయం పట్టుకుంది. మీకే మా ఓటు అంటూ అందరినీ మెప్పిస్తున్న ఓటర్లను చూసి అభ్యర్దులు భయపడుతున్నారు. తీర సమాయానికి ఎవ్వరికి ఓటు వేస్తారో అనే సందేహం అందరిలో కలిగిస్తోంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్దులు, నాయకులలో ఈ టెన్షన్ నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని సారే.. కారే రావాలంటున్నది తెలంగాణ అంటూ బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. భాయి నీకు బాదెందుకు.. మూడు రంగుల జెండా నీదే.. అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రచార అస్త్రాలుగా వాడుకుంటుంది. అయితే వార్డుల్లో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని పరిష్కరించే వారు లేరని ప్రజలు గగ్గోలు పెడుతు ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు.

### ముగిసిన ప్రచారం..

పుర ఎన్నికల్లో మరో కీలక ఘట్టానికి సోమవారం తెరపడింది. సాయంత్రం ఐదు గంటలకు ప్రచార ఘడియలు ముగిసాయి. గల్లీల్లో మారు మ్రోగిన మైకులు మూగబోయాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు ఏడు కార్పొరేషన్లకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు మొత్తం 1,294 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 48 గంటలు సైలెన్స్ పీరియడ్ సమయంలో పట్టణంలో ఎవరూ బహిరంగంగా ఎన్నికల ప్రచారం చేయరాదని హెచ్చరికలు ఉన్నాయి. పోలింగ్ ముగిసేంత వరకు మద్యం, కల్లు దుకాలను మూసి ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్లు ఆదేశించారు. 13న కౌంటింగ్ మూగిసే వరకు డ్రైడే అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే మందు విందుతో పార్టీలు చేసిన అభ్యర్దులు ఇక ఓటును దక్కించుకునేందుకు సిద్దంగా ఉన్నారు. పట్టణాలల్లో కౌన్సిలర్ అభ్యర్దులు దాదాపు రూ.10 లక్షల వెచ్చించేందుకు సిద్దపడ్డారని తెలుస్తోంది. ఒక్కో ఓటుకు రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

## స్వాధీనం చేసుకున్న వాహనాలు తీసుకెళ్లండి

□ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను తిరిగి యజమానులకు అప్పగించడానికి నిర్ణయించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను హనుమకొండ భీమారం, సీఆర్ పీఎఫ్ కేంద్రంలో భద్రపర్చామన్నారు. వాటిని పోలీస్ స్టేషన్ల వారిగా గుర్తించి సబంధిత వాహన యజమానులకు నోటీసులు కూడా పంపామన్నారు. తగిన ఆధారాలతో వచ్చిన యజమానులకు వాహనాలను అందజేయనున్నట్లు ప్రకటిచారు. మరింత సమాచారానికి సీసీఆర్ బీ ఏసీపీ డేవిడ్ రాజ్ ను సంప్రదించాలన్నారు. లేదా ఎంటీఓ రిజర్వ్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ 8712685158, సీసీ ఆర్బీ ఇన్స్ స్పెక్టర్ మల్లయ్య 8008389789 నంబర్లలో సంప్రదించాలని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

### పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేదాజ్ఞలు..

ఈ నెల 11వ తేది బుధవారం మున్సిపల్ ఎన్నికల జరుగనున్న జనగామ, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 10 తేదీ ఉదయం 6 గంటల నుంచి 11 తేదీ రాత్రి 8 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సన్ ప్రీత్ హెచ్చరించారు.

## యువత సేవారంగంపై దృష్టి సారించాలి

- దేశభక్తి భావంతో జాతీయ సమైక్యత
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువత ప్రభుత్వ ఉద్యోగాలకోసమే కాకుండా సేవా రంగంపై కూడా దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. విద్యా, వైద్య రంగాల్లో యువత మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. మేరా యువ భారత్ –వరంగల్, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 9 వరకు ఐదు రోజులు నిర్వహించిన అంతర్రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమం సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని యూత్ హాస్టల్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ అంతర్రాష్ట్ర సమ్మేళనంలో కేరళ రాష్ట్రానికి చెందిన 37 మంది యువతీ–యువకులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అవగాహన చేసుకోవడం, చారిత్రక ప్రదేశాల సందర్శన ద్వారా వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవడం, ఇతర రాష్ట్రాల యువత తమ సంస్కృతి–సంప్రదాయాలను స్థానిక యువతకు పరిచయం చేయడం, జాతీయ సమైక్యతను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ప్రెన్యూర్ షిప్ ఆధ్వర్యంలో నడపబడుతున్న జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఖాజా మసియోద్దీన్, మేరా యువ భారత్ – వరంగల్ ఉప సంచాలకులు చింతల అన్వేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపేల్లి మధు, సూపరింటెండెంట్ దేవి లాల్, ఖమ్మం సూపరింటెండెంట్ భాను, జన శిక్షణ సంస్థాన్ ప్రతినిధి డాక్టర్ తిరుపతి, మై భారత్ వాలంటీర్లు వెల్దండ సురేష్, నవీన్ యాదవ్, వస్థల్య, హార్షిని కర్ణాటక రాష్ట్ర యువజన ప్రతినిధులు, స్థానిక యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కేరళ రాష్ట్రం నుంచి పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు, మెమొంటోలను ప్రధానం చేశారు.

### రోడ్లు వేయండి..

40 వ డివిజన్ పరిధిలో నూతనంగా వెలిసిన కాలనీల్లో రహదారులు నిర్మించాలని, తాగు నీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి గ్రీవెన్స్ లో వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కి వినతి పత్రం అందజేశారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ ను లీకేజీ పేరుతో చెట్టోళ్లగడ్డ వద్ద త్రవ్వి వదిలి వేశారని ఆరోపించారు. ఉర్సు దర్గా, సీఆర్సీ భవన్ ప్రాంతంలోని స్నేహ చికెన్ సెంటర్ వద్ద రోడ్డు ఎగుడు దిగుడుగా ఉందని, దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముకుంద కాలనీ నుంచి ఓపెన్ ఆడిటోరియం మంకీ ఫుడ్ కోర్ట్ జగదాంబ కాలనీ మీదుగా ఉర్సు బైపాస్ రోడ్ వరకు రోడ్డు కంకర తేలి ఎగుడు దిగుడుగా మారిందన్నారు. ఇబ్బందికరంగా మారిన ఈ ప్రాంతంలో నూతన రహదారి నిర్మించాలని కమిషనర్ ను కోరారు. స్పందించిన కమిషనర్ డివిజన్ లోని వివిధ అవసరాలను పరిశీలించి తగు ప్రణాళిక రూపొందించాలని ఏఈ సౌజన్యను ఆదేశించారు.

### 99 ఫిర్యాదులు..

బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో 99 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ నేరుగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో 43, ఇంజనీరింగ్ లో 25, రెవెన్యూలో 11, హెల్త్ & శానిటేషన్ లో 15, నీటి సరఫరాపై ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీహెచ్ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, టీఓ రామకృష్ణ, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో యువత ముందుండాలి

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్
- ధర్మసేతు ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉన్నతమైన లక్ష్యాలతో యువత సామాజిక సేవా రంగంలోకి రావాలని కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని కేయూ ఎంప్లాయీస్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ' సామాజిక సంస్థను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భాస్కర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో పేద, మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా మహిళలు, యువత ఎదుర్కొంటున్న ఆర్థిక, విద్యా, వైద్య సమస్యలను పరిష్కరించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా యువతకు శిక్షణ ఇవ్వడం, మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం, విద్య, వైద్యంపై అవగాహన సదస్సులు నిర్వహించడం వంటి ఆశయాలతో ఈ సంస్థ ఏర్పడటం అభినందనీయమన్నారు. సంస్థ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రశంసించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆస్తుల కంటే ఆరోగ్యమే మిన్న" అని పేర్కొంటూ, తొలిరోజే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం శుభపరిణామమని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ఎలగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. పెద్దల ఆశీస్సులు, మిత్రుల సహకారంతో సమాజానికి మేలు చేయాలనే దృఢ సంకల్పంతో ఈ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సేవలందించిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ భార్గవ్ వెంపటి (న్యూరాలజీ), డాక్టర్ శ్రీపాల్ చెన్నం (ఆర్థో), డాక్టర్ జి.మానస (జనరల్ మెడిసిన్), డాక్టర్ పి.కావ్య (గైనకాలజీ), డాక్టర్ సాయి తేజ రెడ్డి (డెర్మటాలజీ)లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు ఎం.ఎన్. మూర్తి, బొనగాని యాదగిరి గౌడ్, కాలనీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కేయూ రిటైర్డ్ ఉద్యోగులు గుండు చంద్రమౌళి, సుందర్, డాక్టర్ ఏ.నాగేశ్వరరావు, తాళ్లపల్లి రామస్వామి గౌడ్, మౌనిక, ఫార్మసీ సిబ్బంది, సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఇకపై 'ఫెర్టిలైజర్ యాప్' ద్వారానే యూరియా విక్రయాలు

## జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** రైతులు ఇకపై యూరియా కొనుగోలు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫెర్టిలైజర్ యాప్'తప్పనిసరిగా వినియోగించాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు సూచించారు. సోమవారం మండలంలోని కొయ్యూరు అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో యూరియా కొనుగోలు ప్రక్రియపై రైతులకు, డీలర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, యూరియా పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ డిజిటల్ విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. రైతులు తమ మొబైల్ నంబర్ ద్వారా యాప్‌లో లాగిన్ అవ్వాలి. తమకు సమీపంలో ఉన్న ఫెర్టిలైజర్ షాపును ఎంచుకుని యూరియాను బుక్ చేసుకోవచ్చు. రైతులు సాంకేతికతను అందిపుచ్చుకుని ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డీలర్లకు కూడా యాప్ ద్వారా విక్రయాలు జరిపే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రోస్ నిర్వాహకుడు బొమ్మ రమేష్ రెడ్డి, స్థానిక రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** ముస్త్యాలపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం గ్రామస్తులందరూ సహకరించాలని సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ కోరారు. సోమవారం మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రగతి కోసం గత నెల రోజులుగా చేపట్టిన పనులను వివరించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇప్పటికే సైడ్ కాల్వల శుభ్రత పనులు పూర్తి చేశామని తెలిపారు. గ్రామ నర్సరీలో ప్రజలకు ఉపయోగపడే పండ్లు, పూల మొక్కలతో పాటు నాణ్యమైన మొక్కలను పెంచాలని సిబ్బందికి సూచించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, గ్రామంలో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రామసభలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దొంతుల కరుణ దేవి, ఉపసర్పంచ్ బొట్ల శ్యామల, వార్డు సభ్యులు అరవింద్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి పాల్గొన్నారు. వీరితో పాటు ఆశ వర్కర్ సునీత, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది స్వామి, సురేష్, సారయ్య తదితరులు హాజరయ్యారు.

# అభివృద్ధిని అడ్డుకున్న వారిని ప్రజలు గమనించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండేళ్లలో డోర్నకల్ పట్టణానికి చేసిందేమీ లేదని మాజీ వార్డు కౌన్సిలర్ బోరగల శరత్, కాల మౌనిక జైన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు 9, 10 వార్డులలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను ఆలోచింపజేశారు. ప్రచారంలో భాగంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలపై ప్రశ్నల వర్షం కురిపించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని ప్రశ్నించారు. గత వేసవిలో పట్టణ ప్రజలు ఎదుర్కొన్న తాగునీటి సమస్య నేటికీ పరిష్కారానికి నోచుకోలేదని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నోటీసుల ద్వారా అడ్డుకున్న వారు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలి" అని వారు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే పట్టణంలో పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి ఆధునిక వసతులు కల్పించామని గుర్తు చేశారు. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యమని, అభివృద్ధిని అడ్డుకుంటున్న పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. మరోసారి మోసపోయి ఇబ్బందులు పడవద్దని, చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు చెందిన డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అండగా నిలిచింది. వరంగల్ పోచమ్మ మైదానం సమీపంలోని ఎల్.బీ.నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మాసూమ్ అలీ)లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.జయబాల రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ప్రధానోపాధ్యాయులు, కీర్తిశేషులు దొడ్డ నరసింహారెడ్డి ఆశయ సాధన కోసం ఈ సంస్థ నిరంతరం ప్రభుత్వ విద్యాలయాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన మెటీరియల్‌ను అందించినందుకు ట్రస్ట్ చైర్మన్ ప్రతాపరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున, ఈ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జయబాల రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకయ్య, భిక్షపతి, శ్రీధరాచార్యులు, కిషన్, దేవేందర్, మోహన్, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన దమ్మన్నపేట సర్పంచ్



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని దమ్మన్నపేట సర్పంచ్ దుబాసి నవీన్ సోమవారం పరకాల మున్సిపల్ ఎన్నిక ప్రచారానికి విచ్చేసిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. రాష్ట్రంలో జరుగుతున్న పురపాలిక ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా, పరకాల మున్సిపాలిటీలోని 9వ వార్డు ఇంచార్జిగా దుబాసి నవీన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వార్డులో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం చేపట్టిన ప్రచార కార్యక్రమాలు, ఓటర్ల స్పందన, క్షేత్రస్థాయిలో పార్టీ బలాబలాలను ఆయన కేటీఆర్‌కు వివరించారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పరకాల మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ వారికి దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# పారదర్శకంగా పోలింగ్ సిబ్బంది ఎంపిక

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జనరల్ అబ్జర్వర్ కిల్లు శివకుమార్ నాయుడు సమక్షంలో పోలింగ్ సిబ్బందికి సంబంధించిన మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆమె చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల్లో ఎన్నికల విధులకు సంబంధించి ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని ఎంపిక చేశారు. ప్రిసైడింగ్ అధికారులు 80 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 80 మంది, పోలింగ్ అధికారులు 240 మంది, మైక్రో అబ్జర్వర్లు 17 మందికి విధులు అప్పగించారు. అత్యవసర పరిస్థితుల కోసం అదనంగా 20 శాతం రిజర్వ్ సిబ్బందిని కూడా ఈ ప్రక్రియ ద్వారా కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పక్షపాతం లేకుండా, పారదర్శకతను కాపాడటం కోసం స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధులకు ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. ఎంపికైన సిబ్బంది ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా నోడల్ అధికారి నర్సింహ మూర్తి, ఎన్నికల డీటీ రంజిత్, ఇతర ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, ఫిబ్రవరి 09, 2026

# కోతుల బెడదకు 'చింపాంజీ' విరుగుడు

## ఉపసర్పంచ్ వినూత్న ప్రయోగం



**వరంగల్ వాయిస్, మల్లూర్ :** గ్రామాల్లో కోతుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు మల్లూర్ మండలం కొయ్యూరు గ్రామ పంచాయతీ ప్రతినిధులు ఒక వింతైన, వినూత్నమైన ఆలోచనతో ముందుకొచ్చారు. పంటలను నాశనం చేస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కోతులను తరిమేందుకు సాక్షాత్తు ఉపసర్పంచ్ లకావత్ సవేందర్ చింపాంజీ వేషం ధరించి వీధుల్లోకి రావడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. గ్రామంలో కోతుల సమస్య జటిలం కావడంతో సర్పంచ్ కొండ రాజమ్మ, ఉపసర్పంచ్ సవేందర్ చర్చించుకుని ఈ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సవేందర్ చింపాంజీ తరహా కాస్ట్యూమ్ ధరించి గ్రామంలోని వీధులు, పంట పొలాల వెంబడి తిరుగుతూ కోతులను భయపెట్టారు. సాధారణంగా మనుషులకు భయపడని కోతులు, తమకంటే పెద్దగా ఉన్న ఈ 'వింత జంతువు'ను చూసి భయంతో సమీప అడవుల్లోకి పరుగులు తీశాయి. కోతుల బెడద నుంచి ఉపశమనం లభించడంతో గ్రామస్తులు ఉపసర్పంచ్ సాహసాన్ని, ఆయన అంకితభావాన్ని అభినందిస్తున్నారు. కోతులు పూర్తిగా ఊరు విడిచి వెళ్లే వరకు తాను ఇదే వేషంలో విధుల్లో తిరుగుతానని ఉపసర్పంచ్ స్పష్టం చేశారు. కొయ్యూరు ప్రజాప్రతినిధులు చూపిన ఈ తెగువ, ఆలోచనను ఆదర్శంగా తీసుకుని తమ గ్రామాల్లో కూడా కోతుల సమస్యను పరిష్కరించాలని పొరుగు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అధికారుల సహాయం కోసం వేచి చూడకుండా, తమ సమస్యను తామే పరిష్కరించుకున్న తీరుపై ప్రశంసలు కురుస్తున్నాయి.

# వర్ధన్నపేటపై గులాబీ జెండా ఎగరాలి

## నాగుర్ల వెంకటేశ్వర్లు పిలుపు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మున్సిపల్ ఎన్నికల వేళ వర్ధన్నపేటలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కదలాలని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ దిశానిర్దేశం చేయగా.. వర్ధన్నపేట ఇన్చార్జ్, రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వర్ధన్నపేట మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించి, కార్పొరేషన్‌పై గులాబీ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని, కార్యకర్తలు ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం వర్ధన్నపేట పురవీధుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 బైకులతో కార్యకర్తలు గులాబీ జెండాలు చేతబూని నిర్వహించిన ఈ ర్యాలీ పట్టణాన్ని గులాబీమయం చేసింది. కార్యకర్తల నినాదాలతో మున్సిపాలిటీ హోరెత్తింది. ఈ శక్తి ప్రదర్శన ప్రత్యర్థి పార్టీల్లో వణుకు పుట్టించేలా సాగింది. ఈ కార్యక్రమంలో ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులు, స్థానిక ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ లో 13 మందికి జరిమానా

**వరంగల్ వాయిస్ , కాశీబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తులపై న్యాయస్థానం జరిమానా విధించింది. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించి పోలీసులకు చిక్కిన 13 మందిని సోమవారం కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీ నిధి రామ్, నిందితులకు మొత్తం 13,700/- రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ పీఎస్ ఇన్స్పెక్టర్ కె.సుజాత మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం కలగడమే కాకుండా, ఇతరుల భద్రతకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

# విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకుంటాం

## ▪ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ పేదలకు విద్యను దూరం చేసే కుట్రలను అడ్డుకోవడానికి విద్యార్థి లోకం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ గిర్మాజిపేటలోని గాంధీ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా 26వ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా అధ్యక్షులు పార్థసారథి అధ్యక్షతన జరిగిన ఈ సభకు లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. నూతన విద్యా విధానం-2020 పేరుతో విద్యను కేంద్రీకృతం చేస్తూ కాషాయీకరణకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రేషనలైజేషన్ సాకుతో రాష్ట్రంలో 3,680 ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని చూడటం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ₹8,000 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల లేమిని ఎత్తిచూపుతూ కీలక డిమాండ్లు చేశారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 2,560 టీచింగ్, 3,000 నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.




కళాశాల విద్యలో ఉన్న 7,550 ఖాళీలను పూరించాలి. 22 జిల్లాల్లో విద్యాశాఖ అధికారులే లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు, ఆశ్రమ పాఠశాలల్లో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. బాధ్యులైన అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ల శరత్, జిల్లా కమిటీ సభ్యులు శివ కుమార్, పవన్, అభిరామ్, శ్రేయాస్, ప్రభాస్, రాజు, సంతోష్, రాకేష్, నిఖిల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# దొర్నాల అనితకు పద్మశాలి సంఘం మద్దతు



**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ మున్సిపల్ ఎన్నికల బరిలో 19వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దొర్నాల అనిత వెంకటేశ్వర్లుకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం తమ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సోమవారం వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జిల్లాలోని వివిధ మండలాల పద్మశాలి సంఘం అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అనిత గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. పద్మశాలి సామాజిక వర్గ అభివృద్ధి కోసం, సంఘం బలోపేతం కోసం దొర్నాల అనిత వెంకటేశ్వర్లు కుటుంబం నిరంతరం కృషి చేస్తోందని కొనియాడారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలీలంతా ఐక్యంగా ఉండి తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల, పద్మశాలీల సంక్షేమం కోరే అనితను భారీ మెజారిటీతో గెలిపించాలని, 'చేతి గుర్తు'పై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు వేముల బాలరాజుతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు గజ్జల దామోదర్ (చిల్పూర్), మాచర్ల సారయ్య (రఘునాథపల్లి), కరిమికొండ వెంకటేశ్వర్లు (పాలకుర్తి), డాక్టర్ మామిడాల సోమనారాయణ (జాఫర్‌గఢ్) పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్ర నాయకులు రాపోలు రామ్మూర్తి, రాష్ట్ర మీడియా ఇంఛార్జి చింతకింది కృష్ణమూర్తి, కుమారస్వామి, దొర్నాల రమేష్, జనగామ మాజీ కౌన్సిలర్ మచ్చ బాల్ నరసయ్య, కారంపూడి వెంకట నరసయ్య, సంఘం బాధ్యులు తదితరులు పాల్గొని ప్రచారాన్ని హోరెత్తించారు.

# చదువుపై దృష్టి పెట్టండి



**వరంగల్ వాయిస్, భీమారం :** ప్రస్తుత కాలంలో యువత, ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా మాయలో పడకుండా తమ ఉజ్వల భవిష్యత్తు కోసం చదువుపై దృష్టి పెట్టాలని కేయూసీ సీఐ రవికుమార్ హితవు పలికారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం భీమారంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ అండ్ స్కూల్ (గర్ల్స్) లో 'జాగృతి పోలీస్ కళాబృందం' ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్ మాట్లాడుతూ పలు కీలక విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దని, సైబర్ మోసాల బారిన పడకూడదని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100, షీ టీమ్స్, భరోసా కేంద్రాల ప్రాముఖ్యతను వివరిస్తూ.. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా గళమెత్తాలని కోరారు. పోలీస్ జాగృతి కళాబృందం సభ్యులు సామాజిక అంశాలపై ఆలపించిన పాటలు, ప్రదర్శించిన ప్రదర్శనలు విద్యార్థినులను ఎంతగానో ఆలోచింపజేశాయి. తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ క్రమశిక్షణతో మెలగాలని వారు పాటల రూపంలో సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేయూసీ ఎస్ఐ, కాలేజీ ప్రిన్సిపాల్ సుభాషిణి, అధ్యాపక బృందం, కళాబృందం ఇన్చార్జ్ ఉమెన్ ఏఎస్ఐ నాగమణి, హెడ్ కానిస్టేబుల్స్ విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పీసీ పూల్ సింగ్, హోమ్ గార్డ్స్, సుమారు 350 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రేరణ.. అనిత విజయం

## ◆ క్రీడాకారుణికి ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** అంతర్జాతీయ స్థాయిలో షూటింగ్ బాల్ క్రీడలో రాణించి, వరల్డ్ కప్ విజేతగా నిలిచిన నూనవత్ అనితను పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక సన్మాన కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి, కరెస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై అనితను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అనిత అంతర్జాతీయ స్థాయిలో వరల్డ్ కప్ గెలుచుకోవడం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికే గర్వకారణమని కొనియాడారు. ఆమె పట్టుదల, క్రమశిక్షణ నేటి విద్యార్థులకు గొప్ప ప్రేరణ అని, ప్రతి ఒక్కరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. సన్మానం అనంతరం నూనవత్ అనిత



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమ ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని ఆమె వివరించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని ఇస్తాయని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తమ ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు భాస్కర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడలతోనే సోదరభావం పెంపొందుతుంది

- వంకుడోత్ అశోక్ నాయక్
- కేయూలో 'సేవాలాల్ విద్యార్థి సేన' క్రికెట్ టోర్నీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీలో బంజారా విద్యార్థులు నిర్వహిస్తున్న 'సేవాలాల్ సేన క్రికెట్ టోర్నమెంట్, అథ్లెటిక్స్' పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. టోర్నీలో భాగంగా రెండవ రోజు పోటీలను సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకుడోత్ అశోక్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ నాయక్ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు విద్యతో పాటు శారీరక దృఢత్వాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. క్రీడల ద్వారా విద్యార్థుల మధ్య ఐక్యత, సోదరభావం పెరుగుతాయని, సేవాలాల్ మహారాజ్ ఆశయాల బాటలో ప్రతి విద్యార్థి నడవాలని ఆకాంక్షించారు. కేయూ బంజారా విద్యార్థులు ఏటా సేవాలాల్ జయంతిని ఇంత పెద్ద ఎత్తున నిర్వహించడం రాష్ట్రంలోని గిరిజన యువతకు ఆదర్శవంతంగా నిలుస్తోందని కొనియాడారు. ఈ క్రీడా పోటీలలో యూనివర్సిటీలోని దాదాపు 32 విభాగాలకు చెందిన విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంత పెద్ద ఎత్తున క్రీడలను విజయవంతం చేస్తున్న అశోక్ నాయక్, అతని బృందాన్ని యూనివర్సిటీ ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ రమేష్ నాయక్, లైబ్రరీ ఇన్చార్జ్ జవహర్, ప్రొఫెసర్ ఈసం నారాయణ, హన్మకొండ సేవాలాల్ సేన అధ్యక్షుడు మురళి నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు విద్యార్థి నాయకులు పవన్ నాయక్, శ్రీను, వెంకన్న, సచిన్, శ్రీకాంత్, అశోక్,క్రీడాకారులు హాజరయ్యారు.

# జమ్మికుంటలో వరద కాల్వ బాధ్యత నాదే

## మంత్రి శ్రీధర్ బాబు భరోసా




**వరంగల్ వాయిస్, జమ్మికుంట/హుజూరాబాద్ :** "జమ్మికుంట పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను ఏళ్ల తరబడి పీడిస్తున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే బాధ్యత నేను తీసుకుంటాను" అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 6వ వార్డు అభ్యర్థి శ్రీపతి స్వర్ణలత నరేష్‌కు మద్దతుగా సోమవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ ప్రాంతాలు వర్షాకాలంలో జలమయం అవుతున్న విషయాన్ని తాను గమనించానని మంత్రి పేర్కొన్నారు. "ఎంత నిధులైనా కేటాయించి, ఈ ప్రాంతాలకు శాశ్వత వరద కాల్వ నిర్మిస్తాం. ఈ అభివృద్ధి పనులు జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థి స్వర్ణలతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి" అని పిలుపునిచ్చారు. జమ్మికుంట చౌరస్తాలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రణవ్ బాబు, పీసీసీ అధికార ప్రతినిధి పత్తి కృష్ణారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ సహా జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజలు 'కారు' మోసాన్ని గమనించి 'హస్తం' గుర్తుకు ఓటేయాలని ఈ సందర్భంగా నాయకులు విజ్ఞప్తి చేశారు.




# పరకాలలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** "పరకాల పట్టణాభివృద్ధి కేవలం అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం. పట్టణ ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారు" అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన అభ్యర్థుల గెలుపు కోరుతూ వార్డులలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని కోరారు. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వలనే పరకాల పట్టణం అభివృద్ధిలో వెనుకబడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల గురించి వివరిస్తూ రేవూరి ప్రకాశ్ రెడ్డి ఈ కింది అంశాలను ప్రస్తావించారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, సన్న బియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డుల మంజూరు, రైతు రుణమాఫీ పథకం అమలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ చీరల పంపిణీ చేశామని గుర్తు చేశారు. పట్టణంలో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, స్వచ్ఛమైన త్రాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించి పరకాలను 'మోడల్ మున్సిపాలిటీ'గా మారుస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుండే అభ్యర్థులను కాంగ్రెస్ బరిలోకి దించిందని, ఓటర్లంతా ఆలోచించి 'చేతి గుర్తు'పై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# టీఎన్జీఓస్ పై అసత్య ప్రచారాలు సహించం

- ఆకుల రాజేందర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దశాబ్దాల పోరాట చరిత్ర కలిగిన టీఎన్జీఓస్ యూనియన్ ప్రతిష్టను దెబ్బతీసేలా కొన్ని పత్రికల్లో వస్తున్న అసత్య వార్తలను జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తోందని జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన వెలుగు దినపత్రికలో వచ్చిన వార్తలోని అంశాలను తోసిపుచ్చారు. రాజేందర్ మాట్లాడుతూ.. టీఎన్జీఓస్ సంఘం కేవలం ఉద్యోగ సంఘం మాత్రమే కాదని, 610 జీవో సాధనలోనూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ ముందుండి పోరాడిన ఘన చరిత్ర కలిగిన సంస్థ అని గుర్తుచేశారు. అటువంటి సంఘంపై 'మజాకా' అంటూ తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని మండిపడ్డారు. సంఘంలో గెజిటెడ్ అధికారులు ఉన్నారనే విమర్శలపై ఆయన సాంకేతిక వివరణ ఇచ్చారు. గతంలో ఎన్జీఓ కేడర్‌లో ఉండి గెజిటెడ్ హోదా పొందినప్పటికీ, వారికి సర్వీస్ నిబంధనలు మార్చకుండా, గెజిటెడ్ స్కేల్ ఇవ్వకుండా కేవలం పేరుకే హోదా ఇచ్చారని తెలిపారు. అటువంటి కేడర్లు టీఎన్జీఓస్ సంఘంలో కొనసాగడానికి ప్రభుత్వం గతంలోనే అనుమతించిందని, దీనిపై 2010లోనే తీర్మానం చేసి పంపినట్లు వెల్లడించారు. అవసరమైతే సంఘం పేరును తెలంగాణ నేటివ్ గవర్నమెంట్ ఆఫీసర్స్ (TNGO) యూనియన్‌గా మార్చడానికి కూడా తీర్మానం చేసి ప్రభుత్వ అనుమతికి పంపినట్లు ఆయన స్పష్టం చేశారు. సంఘంపై దుర్మార్గంగా వార్తలు రాయిస్తున్న వారు ఎవరో తమకు తెలుసని, సమయం వచ్చినప్పుడు ప్రజాస్వామ్య పద్ధతిలో వారిని ఎదుర్కొంటామని హెచ్చరించారు. "హక్కులు – బాధ్యతలు" రెండు కళ్లుగా పనిచేసే ఏకైక సంఘం టీఎన్జీఓస్ అని, నిన్నగాక మొన్న వచ్చిన వారు ఉద్యోగ సంఘం ముసుగులో చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఉద్యోగులే తిప్పికొడతారని రాజేందర్ ధ్వజమెత్తారు. సంఘాన్ని బద్నాం చేయాలని చూస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, అసత్య ప్రచారాలకు టీఎన్జీఓస్ తలవంచదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ విద్యుత్ రంగంలోని అన్మాన్, ఆర్టిజన్, పీస్ రేటు కార్మికుల దీర్ఘకాలిక సమస్యల సాధనకై యూనియన్లకు అతీతంగా జేఏసీ ఏర్పాటు కావడం శుభపరిణామమని టీయూఈఈ–సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బూర వరుణ్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యుత్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వరుణ్ గౌడ్ విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులను వివరించారు. సంస్థలోని 1607 మంది అన్మాన్ కార్మికుల్లో విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై 50 మందికి పైగా కార్మికులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 50 మందికి పైగా శాశ్వత వికలాంగులుగా మారారని తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి వెంటనే ఉద్యోగం కల్పించి, ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్మాన్, ఆర్టిజన్ కార్మికులకు హక్కులు కల్పించాలి. కార్మికులందరినీ తక్షణమే విద్యుత్ శాఖలో (డిపార్ట్‌మెంట్) విలీనం చేసుకోవాలి. కార్మికులందరి సమస్యలు ఒకే వేదికపై పరిష్కారం కావడానికి జేఏసీ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర నాయకత్వంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అన్మాన్, ఆర్టిజన్, పీస్ రేటు కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం మార్పు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇంటర్మీడియట్ వార్షిక ప్రాక్టికల్ పరీక్ష కేంద్రంలో మార్పులు చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11వ తేదీలలో జరగాల్సిన పరీక్షలు ఇప్పుడు ప్రక్కనే ఉన్న ప్రైవేట్ కళాశాలలో నిర్వహించబడతాయి. పరకాల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పరీక్షలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాన్ని మార్చడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరకాల (సెంటర్ నెం. 38046), కొత్త కేంద్రం ఎస్.వి జూనియర్ కళాశాల, పరకాల (ప్రభుత్వ కళాశాల ప్రక్కనే ఉంటుంది). ఫిబ్రవరి 10,యు 11 (మంగళ, బుధ వారాలు) పరీక్ష నిర్వహించనున్నారు. దీంతో 38046, 38048, 38060, 38330, 38332 సెంటర్ కోడ్‌లు ప్రభావితమవుతున్నాయి. పరీక్ష కేంద్రం మారినప్పటికీ, పరీక్షలు నిర్ణీత సమయానికే యథాతథంగా జరుగుతాయని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మార్పును గమనించి, సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకుని సహకరించాలని ఆయన కోరారు.

# ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు జాతీయ పురస్కారం



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావును జాతీయ స్థాయి పురస్కారం వరించింది. విద్యా, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ విశాఖపట్నానికి చెందిన గ్లోబల్ ఫౌండేషన్ వారు 'భారత్ గౌరవ్ ఉగాది పురస్కారం–2026'కు ఆయన్ని ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వంద శాతం దివ్యాంగుడైనప్పటికీ, మొక్కవోని దీక్షతో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. కేయూ క్యాంపస్‌లోనే ఎంఏ, ఎల్.ఎల్.బి పూర్తి చేసి, 2006లో దివ్యాంగుల సంక్షేమ పథకాలపై పరిశోధన (పీహెచ్ డీ) పూర్తి చేశారు. గత 18 ఏళ్లుగా కేయూలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ.. డిసబుల్డ్ సెల్ డైరెక్టర్, అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ, హాస్టల్స్ డైరెక్టర్ వంటి కీలక బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు విద్యార్థులు, పరిశోధకులు, డాక్టరేట్లు, యూనివర్సిటీ ఉద్యోగులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# అభివృద్ధికి 'హస్తం' అండ కావాలి

## • ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** "స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గమే నా కుటుంబం. ఇక్కడి ప్రజల సంక్షేమం, ప్రగతే నా ఏకైక లక్ష్యం" అని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతితో కలిసి శివునిపల్లి, చాగల్ పరిధిలోని పలు వార్డుల్లో ముమ్మరంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడ్డారు. ఆర్ఎస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే మురికి కాలువలో వేసినట్లేనని ఆయన మండిపడ్డారు. తెలంగాణపై బీజేపీకి ప్రేమ లేదని, ఒక్క జాతీయ ప్రాజెక్టు కూడా ఇవ్వకుండా సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. గత 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రాజయ్య నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి, తన చిలిపి చేష్టలతో ఘనపూర్ పరువు తీశారని ఆరోపించారు. పనులు, పదవులు, పథకాలు అమ్ముకున్న వ్యక్తిని నమ్మితే నష్టపోతారని హెచ్చరించారు. కేవలం నన్ను తిట్టడానికే బీఆర్ఎస్ పార్టీ రాజయ్యను ఒక 'కూలీ'లా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీ రూపురేఖలు మారాలంటే రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ సహకారం తప్పనిసరి అని కడియం పేర్కొన్నారు. రూ. 1,400 కోట్ల నిధులు: గత రెండేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి రూ. 1,400 కోట్లు తీసుకువచ్చానని, ప్రస్తుతం గ్రామ గ్రామాన పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కోసం ముఖ్యమంత్రి వెంటనే రూ. 50 కోట్లు మంజూరు చేశారని, అందులో రూ. 25 కోట్ల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వివరించారు. కడియం శ్రీహరి అంటే ఒక 'బ్రాండ్' అని, 30 ఏళ్లుగా అవినీతి మరక లేకుండా మీ ఆశీర్వాదంతోనే ఈ స్థాయిలో ఉన్నానని భావోద్వేగంగా పేర్కొన్నారు. రాబోయే 11న జరిగే ఎన్నికలలో ప్రజలు ఆలోచించి, అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, వార్డు ఇంచార్జ్ లు, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటగుళ్లలో అశుతోష్ పాండే పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల అద్భుత శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలిచే గణపురం మండల కేంద్రంలోని శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు)ను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్‌కు చెందిన సౌత్ ఈస్ట్రన్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అశుతోష్ పాండే సోమవారం సందర్శించారు. ఆలయ ధర్మకర్త అట్లూరి వెంకటలక్ష్మి నరసింహారావుతో కలిసి ఆలయానికి చేరుకున్న అశుతోష్ పాండేకు అర్చకులు జూలపల్లి నాగరాజు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలోని గణపతి, నందీశ్వరుడు, ప్రధాన దైవమైన గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను శాలువా మరియు పూలమాలతో ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి యాదగిరి గౌడ్ ఆలయ విశిష్టతను, కాకతీయుల కాలం నాటి శిల్పకళా చాతుర్యాన్ని అశుతోష్ పాండేకు వివరించారు. కోటగుళ్లలోని అద్భుతమైన శిల్పాలను చూసి ఆయన ముగ్ధులయ్యారు. ఆలయ పరిసరాలను, అక్కడి శిల్ప సంపదను ఆయన తన కెమెరాలో బంధించారు. ఈ కార్యక్రమంలో కోటగుళ్లు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 ఈసీ మెంబర్‌గా దివ్వెల పూర్ణచందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 క్యాబినెట్ కమిటీలో వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ జర్నలిస్ట్, ఏవివి వాకర్ దివ్వెల పూర్ణచందర్కు కీలక బాధ్యతలు దక్కాయి. 2026వ సంవత్సరానికి గాను ఆయనను ఈసీ మెంబర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం హనుమకొండలోని ఏవీవీ కళాశాల ఆవరణలో వాకర్స్ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేదికపై డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా పూర్ణచందర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆరోగ్య పరిరక్షణలో వాకింగ్ ప్రాముఖ్యతను చాటడంలో పూర్ణచందర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రతినిధులు కొనియాడారు. నియామక పత్రం అందుకున్న దివ్వెల పూర్ణచందర్‌ను వాకర్స్ ప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తడక కుమారస్వామి, మామిడాల సుధాకర్, రాకం మనోహర్ బాబు, ఎల్లా గౌడ్, కస్తూరి రాజు, ప్రతినిధులు బరుపాటి గోపి, పబ్బ విశ్వప్రసాద్, పోలా ధనుంజయ, అనంతుల వేణు, సంపత్, పడిశాల నాగరాజు, ఎన్.నరసింహారావు, శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో వాకర్ మిత్రులు పాల్గొన్నారు. సంఘం బలోపేతానికి, వాకర్స్ సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పూర్ణచందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ములుగు మున్సిపాలిటీలో 144 సెక్షన్ అమలు

### కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాలు



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు మున్సిపల్ ఎన్నికలు - 2026 ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరిధిలో 144 సెక్షన్ (ప్రస్తుత భారతీయ నాగరిక భద్రతా సంహిత-2023 లోని సెక్షన్ 163) అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రకటించారు.ఈ నిబంధనలు ఫిబ్రవరి 9 సాయంత్రం 5:00 గంటల నుంచి ఫిబ్రవరి 12 సాయంత్రం 5:00 గంటల వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకచోట చేరకూడదు. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడానికి వీలులేదు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్ సందర్భంగా ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు, ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందున్న 48 గంటలు, పోలింగ్ ముగిసిన తర్వాత 24 గంటలు అత్యంత కీలకమైనవని ఆయన స్పష్టం చేశారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్న ముఠాపై వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిపిన ఈ దాడుల్లో సుమారు 62 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించారు. హసన్‌పర్తికి చెందిన నల్ల సత్యనారయణ (65) అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా బియ్యాన్ని డంప్ చేస్తున్నట్లు గుర్తించిన టాస్క్ ఫోర్స్ బృందం, అక్కడ తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో పెద్ద ఎత్తున నిల్వ చేసిన బియ్యం బస్తాలు లభ్యమయ్యాయి. బియ్యం పరిమాణం సుమారు 62 క్వింటాళ్లు, మొత్తం విలువ సుమారు రూ. 2,17,000/ ఉంటుంది. ఈ కేసులో నల్ల సత్యనారయణను పోలీసులు అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న ఓర్సు భాను (ఆటో డ్రైవర్) కోసం గాలిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం హసన్‌పర్తి పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి.బాబూలాల్, ఏఎస్సై కె.సుధాకర్, టాస్క్ ఫోర్స్ బృందం, హసన్‌పర్తి పోలీసులు పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినా లేదా అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## బీఆర్ఎస్‌లోకి గండు అన్వేష్ గౌడ్




**వరంగల్ వాయిస్, దామెర:** పరకాల నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దామెర మండలం దుర్గంపేట గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు గండు అన్వేష్ గౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేసి, సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో ఆయన అన్వేష్ గౌడ్ కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూకల్ హైస్కూల్‌లో సీఎం కప్ పోటీలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని జూకల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా సీఎం కప్ జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మంచిక అభినవ్ వినయ్ కుమార్ సారథ్యంలో జరిగిన ఈ పోటీలకు జిల్లాలోని 12 మండలాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు తరలివచ్చి తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువజన క్రీడల అధికారి చిర్రా రఘు మాట్లాడుతూ.. సాఫ్ట్ బాల్, బేస్ బాల్ క్రీడల్లో విద్యార్థులు చూపిస్తున్న ఆసక్తిని అభినందించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విద్యాశాఖ ఏఎమ్ఓ పింగిలి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కప్ పోటీల ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర స్థాయి సీఎం కప్ సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు బండి ప్రసాద్, గాజర్ల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సూదం సాంబమూర్తి, నూకల లింగయ్య, పూర్ణిమ, సమ్మయ్య, హేమలత, కళ్యాణి, సులోచన, దొడ్డ శ్రీలత, రాధికా రాణి, స్వరూప, సంఘ రఘుపతి, హైస్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# నేటి ఓటుతో.. రేపటి అభివృద్ధి

"ప్రజాసేవే పరమావధి.. వార్డు అభివృద్ధే నా లక్ష్యం. ఒక్క అవకాశం ఇవ్వండి.. ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా" అంటూ పరకాల మున్సిపాలిటీ 7వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి **పావుశెట్టి సునీల్** తన ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. సోమవారం వార్డులోని ప్రతి గల్లీలో పర్యటిస్తూ, ప్రతి గడపను తడుతూ ఓటర్లను అభ్యర్థించారు. వార్డులో పేరుకుపోయిన సమస్యలపై సునీల్ నేరుగా ప్రజలతో చర్చిస్తున్నారు.

- పరకాల 7వ వార్డులో 'హస్తం' జోరు పావుశెట్టి సునీల్ విస్తృత ప్రచారం
- ఇంటింటి ప్రచారంలో హామీల జల్లు
- వార్డు సుందరీకరణే లక్ష్యం
- బీఆర్ఎస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు

మున్సిపల్ ఎన్ని ప్రచారంలో ఆయన డ్రైనేజీ సమస్యల పరిష్కారం, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతానని, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సహకారంతో నిరుపేదలకు పక్కా గృహాల మంజూరుకు కృషి చేస్తానని, 7వ వార్డును మున్సిపాలిటీలోనే ఆదర్శంగా, సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రజల చెంతకు వెళుతున్నారు. ఏ సమస్య వచ్చినా స్థానికంగా ఉండి పరిష్కరించే బాధ్యత నాదేనని భరోసా ఇస్తున్నారు.



## ప్రతిపక్షాలపై విమర్శల అస్త్రాలు

గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పరకాలను పట్టించుకోలేదని సునీల్ ధ్వజమెత్తారు. "రంగురంగుల కండువాలు వేసుకొని వచ్చే వారిని అడగండి.. పదేళ్లు ఏం చేశారని? అబద్ధపు హామీలతో వస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులను నమ్మొద్దు. అభివృద్ధి చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయే" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షానికి ఓటు వేస్తే అది 'గుండు సున్నా'తో సమానమని, అధికారం ఉన్న కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఓటర్లకు వివరించారు.

## ఎమ్మెల్యే రేవూరి అండతో ముందడుగు

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అభివృద్ధికి నిలువుటద్దమని, ఆయన నాయకత్వంలో పట్టణం రూపురేఖలు మారుస్తామని సునీల్ పేర్కొన్నారు. "నేను పోటీ చేస్తున్నది డబ్బు సంపాదన కోసం కాదు, ప్రజలకు సేవ చేయడం కోసం. ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందనే నా గెలుపుకు నాంది" అని ధీమా వ్యక్తం చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.















## సునీల్ గెలుపు - పరకాల అభివృద్ధికి మలుపు

వార్డు ప్రజలతో మమేకవుతూ చేపడుతున్న ప్రచారంలో పావుశెట్టి సునీల్, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. "ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఆయన నిరంతరం సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఆయన నాయకత్వమే మాకు కొండంత అండ," అని సునీల్ పేర్కొన్నారు. "అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి. ఎమ్మెల్యే సహకారంతో 7వ వార్డును, పరకాల పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే అవకాశం నాకు ఇవ్వండి," అని ఓటర్లను కోరారు.పరకాల మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. పార్టీ కోఆర్డినేటర్ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తోపాటు వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అడుగుతున్నారు.

# వారిది దండుపాళ్యం బ్యాచ్

- రేవంత్ రెడ్డిని నమ్మి ప్రజలు నష్టపోయారు
- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఆరు గ్యారెంటీలా బాండ్ పేపర్ అడ్రస్ లేదు
- పరకాలను అభివృద్ధి చేసింది చల్లా ధర్మారెడ్డే
- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్న కేటీఆర్



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని, ఎన్నికల ముందు రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలు నెరవేర్చకుండా ప్రజలు నష్టపోయేలా రేవంత్ రెడ్డి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఆరు గ్యారెంటీల బాండ్ పేపరు రాసిచ్చి వాటిని అమలు చేయలేక విఫలమయ్యారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకుల చొక్కా పట్టుకొని నిలదీయాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో బస్టాండు కూడలి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెల్లారిలేస్తే కేసీఆర్ ను తిట్టడమే తప్ప చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కొరవడిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. రేవంత్ రెడ్డిని నమ్మిన ప్రజలను నట్టేట ముంచారని ఆరోపించారు.

### ఏం అభివృద్ధి చేశారు..

పరకాలలో ఏం అభివృద్ధి చేశావని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార రోడ్ షో కార్యక్రమాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. గతంలో ఎమ్మెల్యేగా నర్సంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి ఆగం చేశావ్.. ఇప్పుడు పరకాల అభివృద్ధి చేస్తానని చెప్పి ఎంతో చరిత్ర కలిగిన పరకాలను నిర్వీర్యం చేస్తున్నావని విమర్శించారు. అమాయకులైన తెలంగాణ ప్రజలను ఆరు గ్యారెంటీల పేరుతో రేవంత్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి మోసం చేసి గద్దెనెక్కారని, అదే తెలంగాణ ప్రజలు మేల్కొని ఈ మున్సిపల్ ఎన్నికలతో పాటు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మీ భరతం పట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డుల్లోని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, గండ్ర రమణారెడ్డి, నన్నపనేని నరేందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీమా పథకాలపై ఆందోళన

☐ పార్లమెంట్ లో ప్రశ్నించిన డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి జనధన్ యోజన (పీఎంజేడీవై) కింద ప్రారంభించిన ఖాతాల్లో పెద్ద సంఖ్యలో నిష్క్రియ (డార్మెంట్) ఖాతాలు కొనసాగుతుండటంతోపాటు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్ బీవై) కింద క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండటంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగాం తదితర జిల్లాల పరిధిలో జనధన్ ఖాతాలు 2023 మార్చిలో 10.80 లక్షల నుంచి 2025 మార్చికి 12.50 లక్షలకు పెరిగాయన్నారు. అయితే వీటిలో గణనీయమైన సంఖ్య ఇంకా వినియోగంలోకి రాకపోవడం గమనార్హం అని తెలిపారు. అయితే బ్యాంకుల వారీగా డార్మెంట్ ఖాతాల వివరాలు కేంద్ర స్థాయిలో నిర్వహించడం లేదని ప్రభుత్వం చెప్పడంతో, పథకాల వాస్తవ ప్రయోజనం ప్రజలకు అందుతోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ, అర్ధనగర ప్రాంతాల ప్రజలు ఖాతాల యాక్టివేషన్, కేవైసీ నవీకరణ, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, బీమా అవగాహన, క్లెయిమ్ పరిష్కారంలో ఇంకా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డా. కావ్య గారు పేర్కొన్నారు. గత ఏడాది జూలై నుంచి అక్టోబర్ వరకు నిర్వహించిన గ్రామ పంచాయతీ సాచురేషన్ క్యాంపెయిన్‌లో నియోజకవర్గ పరిధిలో 1,054 శిబిరాలు నిర్వహించిన విషయాన్ని ఎంపీ స్వాగతించినప్పటికీ, ఇవి సరిపోవని, నిరంతర చర్యలు అవసరమని స్పష్టం చేశారు.

# వెంకటేశ్వర్లకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, ఇండోర్ :** భద్రత రంగంలో కీలకమైన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)పై పరిశోధన చేసి బొల్లెపోగు వెంకటేశ్వర్లు పీహెచ్‌డీ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేశారు. 'లైట్‌వెయిట్ క్రిప్టోగ్రాఫిక్ గ్రూప్ కీ మేనేజ్‌మెంట్ ప్రోటోకాల్స్ ఫర్ ది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీని ప్రకటించారు. ఈ పరిశోధన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యూనివర్సిటీ, ఇండోర్ లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో, ఇంజినీరింగ్ & టెక్నాలజీ ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ పరిశోధనకు డాక్టర్ రాజీవ్ జి విశ్వకర్మ మార్గదర్శకులుగా వ్యవహరించారు. తక్కువ వనరులతో పనిచేసే ఐఓటీ పరికరాలకు భద్రతను అందించేలా లైట్‌వెయిట్ క్రిప్టోగ్రాఫిక్ విధానాలను అభివృద్ధి చేయడమే ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశ్యం. ఈ అధ్యయనం భవిష్యత్‌లో స్మార్ట్ సిటీస్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్ ఐఓటీ వంటి రంగాలకు ఎంతో ఉపయోగపడనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వెంకటేశ్వర్లు సాధించిన ఈ విజయం పరిశోధనా రంగంలో యువతకు ప్రేరణగా నిలుస్తుందని విశ్వవిద్యాలయ వర్గాలు ప్రశంసించాయి.

# అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు




**వరంగల్ వాయిస్, కొత్తవాడ :** కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ కమిటీ హాల్ లో సోమవారం అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 192 వరంగల్ వారి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ, పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవనం ప్రతినిధులు చిప్ప వెంకటేశ్వర్లు నేత, దోమల నాగేందర్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరములో 300 మంది పేద అనగారిన వర్గాల ప్రజలు ముఖ్యంగా బీద నేత కార్మికులు కంటి చికిత్సను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 192 వరంగల్ గవర్నర్ కుసుమ వాణి మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని రోగులను ఉద్దేశించి మాట్లాడారు. శిబిరం ముగిసిన తర్వాత ఆపరేషన్లు అవసరమైన పేషంటులను తమతో వారి బస్సులోనే హాస్పిటల్ కు తీసుకెళ్లారు. ఉచిత ఆపరేషన్ తర్వాత రెండు రోజుల తర్వాత ఆసుపత్రి వారు పేషంట్లను తిరిగి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అందత్వ నివారణ సంస్థ నిర్వాహకులు, ఇంటర్నేషనల్ కమిటీ సభ్యులు అలై కుసుమ లింగమూర్తి, పీడీజీ అలై చిప్ప వెంకటేశ్వర్లు, అలై డాక్టర్ మామిడి ఈశ్వరయ్య, అలై పెంట కుమార్, అలై డాక్టర్ అనంతల రమేష్, గజ్జెల ఓంకార్, అలై కోదాటి హేమలత, అలై గాదె రాధిక, అలై దస్తగీర్, అలై రంగు ఆదినారాయణ, అలై వాడిచెర్ల లక్ష్మణ్, అలై స్రవంతి, అలయన్స్ పెద్దలు ఇతరులు పాల్గొన్నారు.

# ప్రచార కార్యక్రమాలపై నిషేధం

- మద్యం, కల్లు దుకాణాలు మూసివేత
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న పరకాల మునిసిపల్ పరిధిలో ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు.

ఎఫ్ఎస్ టి, ఎస్ఎస్ టి, ఎంసీసీ బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలులో ఉంటుందని తెలిపారు.

# రేగొండలో దారుణం

☐ మైనర్ బాలికపై లైంగిక దాడి

**వరంగల్ వాయిస్, రేగొండ :** సమాజంలో రోజురోజుకు మహిళలు, బాలికల భద్రత ప్రశ్నార్థకమవుతోంది. చట్టాలు ఎన్ని వచ్చినా.. మహిళలు, బాలికలపై దాడులు తగ్గడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మైనర్ బాలికపై ఇద్దరు యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో చిన్నారిని మాయమాటలు చెప్పి వేరే ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి.. తర్వాత బాలికను వారి ఇంట్లో వదిలేసినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం పొనగళ్ళ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు పొలం పనులు కోసం వెళ్లగా కామాంధుల కండ్లు ఒంటరిగా ఉన్న ఆమెపై పడ్డాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ఇంట్లోనే ఉన్న ఎనిమిదేళ్ల బాలికను అదను చూసి అపహరించుకుపోయి, తమ పైశాచికత్వాన్ని ప్రదర్శించారు. ఇద్దరు యువకులు కలిసి మద్యం మత్తులో చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడి అనంతరం, ఏమీ ఎరుగనట్టుగా చిన్నారిని తీసుకువచ్చి వారి ఇంట్లోనే పడేసి వెళ్ళిపోయారు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి రాగా బాలిక ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి ఏమైందని బాలికను ప్రశ్నించగా జరిగిన విషయం అంతా చిన్నారి తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వెంటనే బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com